సాక్షి తూర్పుగోదావరి

మంగళవారం । 15 । అక్టోబర్ । 2024



ముహూర్తం కుదిరింది..

వివాహాల సీజన్ మళ్లీ మొదలైంది. ఆశ్వయుజ, కార్తీక, మార్గశిర మాసాల్లో (అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలలు) మంచి లగ్నాలు ఉండటంతో వివాహాది శుభకార్యాలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.


8 లో



పల్లె పండుగ.. ఉత్తి దండగ

పల్లె పండుగ అన్నారు.. ఎనలేని అభివృద్ధికి ఇదే శ్రీకారం అని చెప్పారు.. తీరా తొలి రోజే చేతులెత్తేశారు. ఎంతో చేస్తారని చూసిన ప్రజానీకానికి మొండిచేయి చూపారు.

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం సాయంత్రం 80,215 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 10 వేల క్యూసెక్కుల నీటిని ఇరిగేషన్ అధికారులు విడిచిపెట్టారు.

న్యూస్‌రీల్

విద్యుత్ కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

రాజమహేంద్రవరం సిటీ: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం, సమస్యలు, ప్రమాదాలు ఏర్పడే అవకాశం ఉన్నందున, వాటి పరిష్కారానికి కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్టు ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కె.తిలక్‌కుమార్ సోమవారం ఇక్కడ తెలిపారు. డివిజన్ స్థాయిలో 24 గంటలు పని చేసేలా కంట్రోల్ రూమ్‌లు ఉంటాయన్నారు. రాజమహేంద్రవరం సర్కిల్ 73822 99960, 0883-2463354, రాజమహేంద్రవరం టౌన్ డివిజన్ 94906 10855, రాజమహేంద్రవరం రూరల్ డివిజన్ 94906 10003, నిడదవోలు డివిజన్ 83329 73595 నంబర్లను ఏర్పాటు చేశామన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం, వైర్లు తెగిపోవడం, పోల్స్ ఒరిగిపోవడం, లైన్లపై చెట్లకొమ్మలు పడడం వంటివి గుర్తిస్తే, వెంటనే ఆయా నంబర్లకు తెలియజేయాలని కోరారు.

అర్జీలకు సత్వర పరిష్కారం
– డీఆర్ఓ నరసింహులు



అర్జీలను స్వీకరిస్తున్న డీఆర్ఓ నరసింహులు

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, సత్వరమే పరిష్కరించాలని డీఆర్ఓ జి.నరసింహులు అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు వివిధ సమస్యలపై 120 అర్జీలను సమర్పించారు. టూరిజం రీజనల్ డైరెక్టర్ వి స్వామినాయుడుతో కలిసి డీఆర్ఓ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా డీఆర్ఓ నరసింహులు మాట్లాడుతూ, ప్రజల అర్జీలపై క్షేత్ర స్థాయి సిబ్బందికి తగిన సూచనలిచ్చి, వాటిని పరిష్కరించే దిశగా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్డీఓలు రెవెన్యూ సంబంధిత అంశాలపై తహసీల్దార్లకు దిశానిర్దేశం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు 47, వ్యవసాయ శాఖ 22, పోలీసు 15, పంచాయతీరాజ్ 9, ఇతర శాఖలకు సంబంధించి 27 అర్జీలు స్వీకరించినట్టు చెప్పారు.

చట్ట పరిధిలో అర్జీలు పరిష్కరించాలి
ఎస్పీ డి.నరసింహ కిషోర్



ఫిర్యాదుదారుల సమస్యను వింటున్న ఎస్పీ నరసింహ కిషోర్

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): నిర్ణీత సమయంలో చట్ట పరిధిలోని అర్జీలను పరిష్కరించాలని ఎస్పీ డి.నరసింహ కిషోర్ అన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు వచ్చిన అర్జీలపై సంబంధిత స్టేషన్ల పోలీసు అధికారులతో ఆయన ఫోన్‌లో పలు సూచనలు చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 15 అర్జీలు వచ్చాయి. జిల్లా నలుమూలల నుంచి ప్రజల నుంచి వచ్చిన వివిధ రకాల అర్జీలను ఆయన స్వీకరించారు. వారి కష్టాలను, బాధలను ఎస్పీ నరసింహ కిషోర్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఎస్పీ మాట్లాడుతూ, అర్జీలకు నాణ్యతతో పాటు, నిర్దేశించిన గడువులోగా పరిష్కార చర్యలు తీసుకుంటామన్నారు.

ఇక రత్నగిరికి కార్తిక శోభ

- ఆలయ విభాగాలను పరిశీలించిన ఈఓ
- 19న ప్రభుత్వ, దేవస్థానం అధికారుల సమన్వయ సమావేశం
- తులాభారానికి వెండి తొడుగుకు ఏర్పాట్లు

అన్నవరం: దసరా ఉత్సవాలు ముగిసి, మరో రెండు వారాల్లో ప్రారంభమవుతున్న కార్తిక మాసంలో సత్యదేవుని ఆలయానికి వచ్చే లక్షలాది మంది భక్తుల కోసం చేపట్టాల్సిన ఏర్పాట్లపై అన్నవరం దేవస్థానం అధికారులు దృష్టి సారించారు. దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ సోమవారం దేవస్థానంలోని పలు విభాగాల్లో జరుగుతున్న కార్తికమాస ఏర్పాట్లను పరిశీలించి, అధికారులకు పలు ఆదేశాలిచ్చారు. ఈ నెల 22కల్లా కార్తికమాస ఏర్పాట్లు పూర్తి కావాలని ఆదేశించారు. కార్తికమాస ఏర్పాట్లపై ఈ నెల 19న జరగనున్న ప్రభుత్వ, దేవస్థానం అధికారుల సమన్వయ కమిటీ సమావేశానికి విభాగాల వారీగా ప్రణాళికలతో అధికారులు హాజరు కావాలని ఆయన ఆదేశించారు.

కూటమికే కిక్కు..!

- మద్యం టెండర్లలో సిండికేట్లదే హవా
- సింహభాగం దుకాణాలు దక్కించుకున్న టీడీపీ, జనసేన మద్దతుదారులు
- ముగిసిన షాపుల కేటాయింపు ప్రక్రియ
- లాటరీ ద్వారా ఎంపిక చేసిన అధికారులు
- ఒక్కో షాపునకు ముగ్గురి ఎంపిక
- ఉదయం 8.30కు ప్రారంభమై.. సాయంత్రం 6 వరకు సాగిన తతంగం
- ఆనం కళాకేంద్రం వద్ద కాంట్రాక్టర్ల హడావుడి

కూటమి నేతల ఎత్తులు సఫలమయ్యాయి. బెదిరింపులకు సార్థకత చేకూరింది. టీడీపీ, జనసేన నేతల సిండికేట్ల హవా కొనసాగింది. అంతిమంగా మద్యం కిక్కు కూటమి నేతలకే దక్కింది. సింహ భాగం వారే దక్కించుకోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. మొత్తానికి మద్యం దుకాణాల వ్యవహారంలో కొద్ది రోజులుగా కొనసాగుతున్న సస్పెన్స్‌కు లాటరీ ప్రక్రియతో తెరపడినట్టయింది.

సాక్షి, రాజమహేంద్రవరం: మద్యం దుకాణాల లాటరీ ప్రక్రియలో జిల్లావ్యాప్తంగా అత్యధిక దుకాణాలు కూటమి నేతలే కైవసం చేసుకున్నారు. షాపుల ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తున్నారు. మిగిలిన వాటిని ఎలా హస్తగతం చేసుకోవాలన్న వ్యూహాలు రచిస్తున్నారు. ఇతరులకు దక్కిన షాపులు తమకే ఇవ్వాలంటూ వ్యాపారులను బెదిరింపులకు గురిచేస్తున్నారు. లేదంటే 20 శాతం వాటా కట్టబెట్టాలంటూ హుకుం జారీ చేస్తున్నారు.

125 దుకాణాలకు..

నూతన మద్యం పాలసీ 2024–2026లో భాగంగా తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా 125 మద్యం దుకాణాలకు టెండర్లు ఆహ్వానించారు. వ్యాపారుల నుంచి 4,384 దరఖాస్తులందాయి. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు షాపుల కేటాయింపునకు సోమవారం స్థానిక ఆనం కళాకేంద్రంలో లాటరీ ప్రక్రియ నిర్వహించారు. కలెక్టర్ పి.ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ సమక్షంలో లాటరీ ప్రారంభించారు. ఉదయం 8.30 గంటలకు ప్రారంభమైన లాటరీ విధానం.. సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది. తొలుత రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలోని షాపుల లాటరీ ప్రక్రియ మొదలైంది. అనంతరం మండలాలు, మున్సిపాలిటీల వారీగా అక్షర క్రమంలో లాటరీ ప్రక్రియ కొనసాగింది. పద్ధతిని జేసీ ఎస్.చిన్నరాముడు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సీహెచ్ లావణ్య పర్యవేక్షించారు. దరఖాస్తు చేసుకున్న వ్యక్తులను మాత్రమే లోనికి అనుమతించారు. లాటరీ పద్ధతిలో మొదటి వ్యక్తితో పాటు, మరో ఇద్దరిని ఎంపిక చేశారు. మొదట ఎంపికైన వ్యక్తి నిర్ణీత కాలవ్యవధిలో ఫీజు చెల్లించకపోతే, మిగిలిన ఇద్దరిలో ఒకరికి కేటాయిస్తారు. ఎంపికైన వారు ప్రతి రెండు నెలలకు ఒకసారి చొప్పున ఆరు విడతల్లో రూ.65 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. రేపటి నుంచి ప్రైవేటు షాపుల్లో మద్యం అమ్మకాలు ప్రారంభం కానున్నాయి. లాటరీ నేపథ్యంలో ఆనం కళాకేంద్రం వద్ద వ్యాపారుల హడావుడి నెలకొంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించారు.

- రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గంలో మొత్తం 28 దుకాణాలకు లాటరీ నిర్వహించగా, 17 షాపులు టీడీపీ, జనసేన సిండికేట్‌కు దక్కాయి. మిగిలిన దుకాణాల్లో సైతం వాటా ఇవ్వాలని పట్టుబడుతున్నట్టు తెలిసింది.
- దేవరపల్లి మండలంలో 5 షాపులుండగా.. 3 షాపులు టీడీపీ నేతలు దక్కించుకున్నారు.
- గోపాలపురం మండలంలో 3 షాపులకు గాను ఒకటి కొవ్వూరుకు చెందిన మద్యం వ్యాపారి చౌదరికి దక్కింది. మిగిలిన రెండు బయటి వ్యక్తులకు కేటాయించారు.
- బిక్కవోలు మండలంలో ఐదు షాపుల్లో ఒకటి టీడీపీ సానుభూతిపరులకు వచ్చింది.
- పెరవలి మండలంలో 5 షాపులకు అన్నీ టీడీపీకే దక్కాయి. అన్నీ కూటమి నేతలే దక్కించుకోవడం చర్చనీయాంశంగా మారింది.
- కోరుకొండ మండలంలో 4 షాపులకు గాను అన్నింటినీ టీడీపీ నేతలే కైవసం చేసుకున్నారు.
- నిడదవోలు నియోజకవర్గంలో టీడీపీ పాత సిండికేట్ హవా కొనసాగింది. నిడదవోలు రూరల్ మండలంలో 5 దుకాణాలకు గాను 4, నిడదవోలు పట్టణంలో నాలుగు షాపులు సైతం టీడీపీ సిండికేట్ చేతుల్లోకి వెళ్లిపోయాయి.
- రాజానగరం నియోజకవర్గంలో 13 షాపులకు గాను 9 షాపులు కూటమికి చెందిన వ్యక్తులు సొంతం చేసుకున్నారు. తొమ్మిది షాపుల్లో జనసేన 6, టీడీపీ 3 షాపులు పంచుకున్నాయి.
- చాగల్లు మండలంలో 4 షాపులుండగా.. 2 షాపులు కైవసం చేసుకున్నారు. మిగిలినవి బయటి వ్యక్తులు హస్తగతం చేసుకున్నారు.



మద్యం దుకాణాలకు తీస్తున్న లాటరీని పర్యవేక్షిస్తున్న కలెక్టర్ పి.ప్రశాంతి, జేసీ చిన్నరాముడు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సీహెచ్ లావణ్య

కూటమి మద్దతు సిండికేట్లదే హవా..!

మద్యం షాపులు దక్కించుకునేందుకు కూటమి నేతలు అడ్డగోలు వ్యవహారానికి తెర తీశారు. నూతన పాలసీ ప్రకటించడమే తరువాయి.. రంగంలోకి దిగిన టీడీపీ, జనసేన నేతలు, గత టీడీపీ ప్రభుత్వంలో సిండికేట్ నడిపిన నేతలు దుకాణాలను హస్తగతం చేసుకునేందుకు చేసిన ప్రయత్నాలు వర్ణనాతీతంగా మారాయి. ఒప్పుకుంటే ఓకే.. లేదంటే బెదిరింపులకు దిగడం.. అప్పటికీ లొంగకపోతే 20 శాతం వాటా ఇవ్వాలని హుకుం జారీ చేయడం పరిపాటిగా మారింది. ఎట్టకేలకు కొన్ని నెలలుగా నెలకొన్న ఉత్కంఠతకు లాటరీతో తెర పడింది. కూటమి నేతల సిండికేట్‌కే అత్యధిక షాపులు దక్కాయి.



మద్యం దుకాణాల లాటరీకి హాజరైన టెండరుదారులు

15 మంది మహిళలు

మద్యం షాపుల కేటాయింపుల్లో 15 మంది మహిళలకు లక్కు దక్కింది. జిల్లా వ్యాప్తంగా 125 షాపులకు లాటరీ ప్రక్రియ జరగ్గా అందులో 15 మంది మహిళలున్నట్టు అధికారులు వెల్లడించారు. వీరు 16వ తేదీ నుంచి మద్యం వ్యాపారం చేయనున్నారు. ఈ అంశం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

లక్కీ నంబర్ 7

ఆనం కళాకేంద్రంలో నిర్వహించిన లాటరీ ప్రక్రియలో లక్కీ నంబర్‌గా 7 నిలిచింది. టెండర్లు వేసిన వ్యాపారులకు టోకెన్ నంబర్లు కేటాయించారు. లాటరీలో షాపులు దక్కించుకున్న వారిలో అత్యధికంగా 7వ నంబర్ ఉన్న వారే ఉండటం గమనార్హం. ఉదాహరణకు 7, 17, 27 ఇలా.. దీంతో 7వ నంబర్ లక్కీ నంబర్‌గా మారిందన్న చర్చ వ్యాపారుల్లో కొనసాగింది. షాపులు తమకే దక్కాలని వ్యాపారులు లాటరీ ప్రక్రియకు హాజరయ్యే ముందు ఆలయాల్లో ప్రత్యేక పూజలు సైతం నిర్వహించారు.

చౌదరి గారి చాతుర్యం..!

మద్యం సిండికేట్‌లో టీడీపీ నేత చౌదరి గారి చాతుర్యం కొనసాగింది. గత టీడీపీ ప్రభుత్వంలో ఆయన చక్రం తిప్పారు. మద్యం సిండికేట్‌లో తనదైన శైలిలో హవా కొనసాగించారు. ప్రస్తుతం ఆయనే రంగంలోకి దిగారు. మూడు నియోజకవర్గాల్లో షాపులను దక్కించుకున్నట్టు తెలిసింది. కొవ్వూరు, గోపాలపురం, నిడదవోలులో ఆయన వర్గీయులు షాపులు దక్కించుకున్నారు.

తొమ్మిదిన్నర గంటల ఉత్కంఠ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): నూతన మద్యం పాలసీ మేరకు జిల్లాలోని 125 మద్యం షాపులకు దరఖాస్తుచేసుకున్న అభ్యర్థుల ఎంపిక కోసం నిర్వహించిన లాటరీ ప్రక్రియ దాదాపు తొమ్మిదిన్నర గంటల పాటు కొనసాగింది. సోమవారం స్థానిక ఆనం కళాకేంద్రంలో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మద్యంషాపుల లాటరీ ప్రక్రియను కలెక్టర్ పి.ప్రశాంతి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ, పారదర్శకంగా ప్రక్రియ కొనసాగుతుందన్నారు. జిల్లాలో 125 షాపుల కోసం 4,384 దరఖాస్తులు అందగా, రాష్ట్రంలో మూడో స్థానంలో నిలిచిందని చెప్పారు. ఇలాఉండగా ఎక్సైజ్ సూపరింటెండెంట్ చింతాడ లావణ్య, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్(ఎన్‌ఫోర్స్‌మెంట్) టి.శివప్రసాద్ నేతృత్వంలో జేసీ చిన్నరాముడు, ఆర్డీఓ కృష్ణనాయక్ సమక్షంలో లాటరీ ప్రక్రియ చేపట్టారు. సాయంత్రం ఆరు గంటలకు ముగిసింది. ఈ నేపథ్యంలో దరఖాస్తుదారుల్లో ఉత్కంఠ నెలకొంది. అనంతరం ఎంపికైన వారికి సెలెక్షన్ ఇంటిమేషన్ లెటర్‌ను అందజేశారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ లావణ్య మాట్లాడుతూ, ఎంపికైన అభ్యర్థులందరికీ ఇంటిమేషన్ లెటర్లు ఇస్తారన్నారు. చలానా చెల్లిస్తే ప్రొవిజనల్ లైసెన్స్ ఇస్తామని, ఐడీ, పాస్‌వర్డ్ కేటాయిస్తామని వివరించారు. తద్వారా ఐఎంఎల్ డిపో నుంచి మద్యం స్టాకును తీసుకోవచ్చని తెలిపారు.



సెలెక్షన్ ఇంటిమేషన్ లెటర్‌ను అందజేస్తున్న జేసీ చిన్నరాముడు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సీహెచ్ లావణ్య, అసిస్టెంట్ కమిషనర్ శివప్రసాద్

రైతులు అప్రమత్తంగా ఉండండి
జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

రాజమహేంద్రవరం రూరల్: ప్రకృతి విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికల నేపథ్యంలో అధిక వర్షాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ (సార్వా) పంట కోతకు సిద్ధంగా ఉందన్నారు. సన్న రకాలైన పీఆర్ 126, ఆర్‌పీఐయో ఇప్పటివరకు సుమారు 418 హెక్టార్ల వరకు కోతలు జరిగాయని చెప్పారు. ఓపెన్ మార్కెట్‌లో అమ్మకాలు జరుగుతున్నప్పటికీ, గిట్టుబాటు ధర ఉండేలా చూసుకోవాలన్నారు. నూర్చిన ధాన్యం వర్షానికి తడవకుండా, సురక్షిత ప్రదేశాల్లో ఉంచేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ప్రస్తుతం వర్షాలు అధికంగా ఉన్న ప్రదేశాల్లో ఖరీఫ్ సీజన్ కోతలు పూర్తి స్థాయిలో నిలుపుదల చేయాలన్నారు పొలంలో నీరు నిలవకుండా, నీరు బయటకు పోయేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. మరీ అధికంగా వర్షం కురిస్తే, వర్షం తగ్గాక ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని కొంకులపై పడేలా పిచికారీ చేసి, పక్వానికి వచ్చిన పంటకు సంరక్షణ చర్యలు చేపట్టాలన్నారు.

వరి కోతలు చేపట్టవద్దు

- అధిక వర్షాలు కురిసే అవకాశం ఉంది
- రెవెన్యూ, వ్యవసాయ శాఖల యంత్రాంగం అప్రమత్తంగా ఉండండి
- కొత్తగా చేరిన ఎంపీడీఓలు తక్షణం రిపోర్టు చేయండి
- పల్లె పండుగకు సచివాలయ సిబ్బంది, ఉపాధి కూలీలు హాజరుకావాలి
- కలెక్టర్ పి ప్రశాంతి ఆదేశం

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): అధిక వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వరి కోతలు చేపట్టవద్దని కలెక్టర్ పి.ప్రశాంతి రైతులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి ఆర్డీఓ, మండల ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఇతర క్షేత్ర స్థాయి అధికారులతో అధిక వర్షాలు, తుపాను హెచ్చరికలు, పల్లె పండగ తదితర అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ, అధిక వర్షపాతం నమోదు కానున్న నేపథ్యంలో ఆర్డీఓలు విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికలను జాగ్రత్తగా గమనిస్తూ, తగిన చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు. జిల్లాలో 2,555 మెట్రిక్ టన్నుల ధాన్యం కోతలు జరిగినట్టు సమాచారం ఉందని, అది ఓపెన్ మార్కెట్‌కు వెళ్లిందా, లేదా అనేది వ్యవసాయాధికారులు నిర్ధారణ చేసుకోవాలన్నారు. వాటి వివరాలు యాప్‌లో నమోదు చేయాలన్నారు. పీఆర్ 126 లేదా ఇతర ఫైన్ వెరైటీ ధాన్యం అమ్మకాలపై దృష్టి పెట్టాలన్నారు. గన్ని బ్యాగుల కేటాయింపులు, వాహనాల ఏర్పాటు, హమాలీలపై దృష్టి పెట్టాలన్నారు.

పల్లె పండుగ కార్యక్రమంలో మార్గదర్శకాల మేరకు నడుచుకోవాలని ఆదేశించారు. జిల్లాలో కొత్తగా చేరిన ఎంపీడీఓలు తక్షణం తనకు రిపోర్టు చేశాకే విధుల్లో చేరాలని స్పష్టం చేశారు. ఉపాధి హామీ కూలీలు, సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా పల్లె పండుగకు హాజరుకావాలన్నారు. గైర్హాజరైన గ్రామ స్థాయి సచివాలయ సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రతి మండలం నుంచి లోతట్టు, ముంపు ప్రాంతాల్లో సమస్య ఉన్న శ్మశానవాటికల అభివృద్ధికి ప్రతిపాదనలు పంపాలన్నారు.



సమావేశంలో సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, చిత్రంలో డీఆర్ఓ నరసింహులు

16 నుంచి రీచ్‌లు ప్రారంభం

ఇసుక రీచ్‌లు ఈ నెల 16 నుంచి ప్రారంభం కానున్న దృష్ట్యా సీసీ కెమేరాలను 24 గంటల్లో ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి రీచ్ పాయింట్‌కు 4 నుంచి 6 ప్రాంతాల్లో సీసీ కెమేరాలు సిద్ధం చేయాలన్నారు. తర్వాతే ఇసుక తవ్వకాలు చేపట్టాల్సి ఉంటుందన్నారు. దీనిపై ఆర్డీఓలు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్ఓ జి.నరసింహులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా టెట్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లాలో ఉపాధ్యాయుల అర్హత పరీక్షలు సోమవారం ప్రశాంత వాతావరణంలో జరిగాయని పాఠశాలల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు తెలిపారు. ఉదయం సెషన్–1లో 240 మంది అభ్యర్థులకు 210 మంది, మధ్యాహ్నం సెషన్–2లో 240 మందికి 189 మంది హాజరయ్యారని చెప్పారు.

19, 20 తేదీల్లో రైఫిల్ షూటింగ్ పోటీలు

రాజానగరం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలు మండలంలోని సంపత్‌నగరం రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఈ నెల 19, 20 తేదీల్లో జరుగుతాయని ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎస్ ఆర్‌కేవీ స్వామి తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈ పోటీలకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 450 మంది క్రీడాకారులు హాజరుకానున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నారు.

కాసుల పంటకు రెడీ

రైతులు కాసుల పంట సాగుకు శ్రీకారం చుట్టారు. ఊహించని విధంగా లాభాలు ఆర్జిస్తున్న వర్జీనియా పొగాకు సాగుకు రైతాంగం సన్నద్ధమవుతోంది. అంతర్జాతీయ మార్కెట్లో నెలకొన్న గిరాకీ కూడా వీరికి బాగా కలిసొచ్చింది. ఈ నేపథ్యంలోనే బ్యారన్లను, కౌలుకు భూములను సమకూర్చుకునేందుకు రైతులు ఎగబడుతున్నారు.

- వర్జీనియా పొగాకు సాగుకు రైతుల శ్రీకారం
- గణనీయంగా పెరగనున్న సాగు విస్తీర్ణం
- మెట్ట ప్రాంతంలో ప్రధాన వాణిజ్య పంట
- అనుమతికి మించి సాగుకు సన్నాహాలు
- రైతులకు ఊహించని లాభాలు
- 24,776 హెక్టార్లలో సాగుకు అనుమతి
- 12,861 మంది రైతులు, 14,856 బ్యారన్లు

దేవరపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు దాదాపు రూ.12 వేల కోట్ల ఆదాయం తెచ్చిపెట్టడంతో పాటు, సాగు చేస్తున్న రైతులకు కాసులు కురిపిస్తున్న వర్జీనియా పొగాకు సాగుకు రైతులు శ్రీకారం చుట్టారు. 2024–25 ఏడాదికి పొగాకు బోర్డు బ్యారన్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభించడంతో రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నారు. తూర్పు, ఏలూరు జిల్లాల్లోని దాదాపు 10 మండలాల్లో రైతులు వర్జీనియా పొగాకు సాగు చేస్తున్నారు. 1964లో దేవరపల్లి మండలం చిన్నాయగూడెంలో వర్జీనియా పొగాకు సాగు ప్రారంభించారు. అప్పట్లో కేవలం ఐదెకరాల్లో ప్రారంభమైన సాగు.. ప్రస్తుతం దాదాపు 60 వేల ఎకరాల్లో జరుగుతోంది. పంట సాగులో రైతులు అనేక ఒడిదుడుకులు ఎదుర్కొని ధైర్యంగా నిలబడ్డారు. గత మూడేళ్లుగా రైతులకు పొగాకు పంట కాసులు కురిపిస్తోంది. దీంతో పొగాకు రైతులు ఆర్థికంగా బలపడ్డారు.

80 వేల ఎకరాల్లో సాగు

పొగాకు బోర్డు 2023–24 ఏడాదిలో 60,500 ఎకరాల్లో పంట సాగుకు అనుమతివ్వగా, సుమారు 80 వేల ఎకరాల్లో రైతులు సాగు చేశారు. ఈ ఏడాది లక్ష ఎకరాలు దాటవచ్చని అధికారుల అంచనా. సాగు విస్తీర్ణం పెంచవద్దని బోర్డు అధికారులు రైతులకు పదేపదే హెచ్చరికలు చేస్తున్నప్పటికీ, రైతులు బేఖాతరు చేస్తున్నారు.

అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్

ఇక్కడ పండించిన పొగాకుకు అంతర్జాతీయ మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. జింబాబ్వే, బ్రెజిల్, ఆఫ్రికా దేశాలకు దీటుగా ఇక్కడ రైతులు పొగాకు ఉత్పత్తి చేస్తున్నారు. 2023–24 పంట కాలంలో 48.50 మిలియన్ల కిలోల ఉత్పత్తికి బోర్డు అనుమతివ్వగా, రైతులు 67 మిలియన్ల కిలోలు ఉత్పత్తి చేశారు. అయితే జింబాబ్వే, బ్రెజిల్ దేశాల్లో పంట ఉత్పత్తి గణనీయంగా తగ్గడంతో, దేశీయ పొగాకుకు అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ ఏర్పడింది. దీంతో పొగాకు చరిత్రలో ఎన్నడూ ఊహించని ధర మార్కెట్లో లభించింది. కిలో గరిష్ఠ ధర రూ.410, సగటు రూ.326.20 లభించింది. ఎకరాకు సుమారు రూ.3 లక్షల ఆదాయాన్ని రైతులు పొందారు. దీంతో రైతులు ఈ ఏడాది మరింత దూకుడు పెంచి పంట సాగు చేస్తున్నారు. 2023–24 సీజన్‌లో ఎస్ఎల్ఎస్ (నార్తరన్ లైట్ సాయిల్) రైతులు రూ.2,179 కోట్ల విలువైన పొగాకు విక్రయాలు జరిపారు. రైతుల విజ్ఞప్తి మేరకు కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ రైతులు చెల్లించాల్సిన అదనపు పంటపై అపరాధ రుసుం రూ.116 కోట్లను రద్దు చేసింది.



దేవరపల్లి మండలం బుచ్చియపాలెంలో వేస్తున్న వర్జీనియా పొగాకు నాట్లు

58.75 మిలియన్ల కిలోలకు అనుమతి

ఎస్ఎల్ఎస్ ప్రాంతంలో 2024–25 ఏడాదికి 58.75 మిలియన్ల కిలోల ఉత్పత్తికి బోర్డు అనుమతిచ్చింది. రైతులు దీనికి లోబడి పండించాల్సి ఉంది. బ్యారన్‌కు గతంలో 35 క్వింటాళ్ల ఉత్పత్తికి అనుమతివ్వగా, అధిక దిగుబడులు వచ్చే వంగడాలు సాగు చేస్తున్నందున దీని పరిమాణం 41.25 క్వింటాళ్లకు అనుమతి ఇచ్చింది.



నాటడానికి మడుల్లో సిద్ధంగా ఉన్న పొగాకు నారు

భారీగా పెరిగిన బ్యారన్ల ఖరీదు

అదేవిధంగా బ్యారన్ల ఖరీదు, భూముల కౌలు భారీగా పెరిగాయి. మార్కెట్లో పొగాకు ధరలు ఊహించని విధంగా పెరగడమే ఇందుకు కారణం. రెండేళ్ల క్రితం బ్యారన్ ఖరీదు(బ్యారన్, లైసెన్సు) రూ.2.50 లక్షలు ఉండగా, ప్రస్తుతం రూ.8 లక్షలు పలుకుతోంది. బ్యారన్ అద్దె రూ.70 వేల నుంచి రూ.2.50 లక్షలకు చేరింది. ఇక భూముల కౌలు మరీ దారుణంగా ఉన్నాయి. ఏరియాను బట్టి ఎకరం కౌలు రూ.70 వేల నుంచి రూ.90 వేలు పలుకుతున్నాయి. అయినా రైతులు పోటీపడి భూములను కౌలుకు, బ్యారన్లను అద్దెకు తీసుకుంటున్నారు. కొందరు రైతులు బ్యారన్ల లైసెన్సులు కొనుగోలు చేసి కొత్తగా నిర్మాణాలు చేస్తున్నారు. పొగాకు సాగు చేస్తున్న రైతుల్లో ఎక్కువగా కౌలుదారులే ఉన్నారు.

రీజియన్ పరిధిలో..

పొగాకు బోర్డు రాజమహేంద్రవరం రీజియన్ పరిధిలో దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెంలోని రెండు వేలం కేంద్రాల పరిధిలో వర్జీనియా పొగాకు సాగవుతోంది. తొర్రేడు ప్రాంతంలో 932 మంది రైతులు 990 బ్యారన్లు కలిగి, 1,089 హెక్టార్లలో బ్లాక్ సాయిల్(బీఎస్) పొగాకు పండిస్తున్నారు. ఇక్కడ పండించిన పొగాకు రైతులు దేవరపల్లి వేలం కేంద్రంలో విక్రయాలు జరుపుతున్నారు.

రిజిస్ట్రేషన్లు ప్రారంభం



బ్యారన్ల రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. లైసెన్సు ఉన్న రైతులు తమ బ్యారన్లను వేలం కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించాలి. ఈ నెల 24 వరకు గడువు ఉంది. రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులు బ్యాంకుల వద్ద డాక్యుమెంటేషన్ చేయించి, వేలం కేంద్రాల వద్ద ఎరువులను పొందవచ్చు. నాట్లు మందకొడిగా జరుగుతున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన తుపానుకు రైతులు భయపడి నాట్లు వేయడం లేదు. ఈ నెలాఖరుకు నాట్లు ఊపందుకోవచ్చు. రీజియన్ పరిధిలోని ఐదు వేలం కేంద్రాల్లో నాట్లు లాంఛనంగా ప్రారంభించారు.

– జీఎల్‌కే ప్రసాద్, పొగాకు బోర్డు రీజనల్ మేనేజరు, రాజమహేంద్రవరం

ముహూర్తం కుదిరింది..

- మూడుముళ్ల బంధానికి మోగిన భాజా
- పెళ్లిళ్ల సీజన్ ప్రారంభం
- డిసెంబర్ నెలాఖరు వరకూ శుభగడియలు
- కల్యాణ మంటపాలకు పెరిగిన డిమాండ్



పచ్చిపూలతో రూపొందించిన కల్యాణ మండపం

కొత్తపేట: మూడుముళ్ల బంధానికి ముహూర్తం కుదిరింది.. పెళ్లి గడియ రానే వచ్చింది.. వివాహాల సీజన్ మళ్లీ మొదలైంది. ఆశ్వయుజ, కార్తిక, మార్గశిర మాసాల్లో (అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలలు) మంచి లగ్నాలు ఉండటంతో వివాహాది శుభకార్యాలకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆ మేరకు ఈ నెల 13 నుంచి మంచి ముహూర్తాలు ప్రారంభమై డిసెంబర్ 30 వరకూ ఉన్నట్టు వేద పండితులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కల్యాణ మండపాలకు డిమాండ్ పెరిగింది. అలాగే ఈవెంట్ మేనేజర్లు, క్యాటరింగ్, లైటింగ్, షామియానా, అలంకరణ కార్మికులకు ముందస్తు బుకింగ్‌లు వచ్చాయి. ఇదే ముహూర్తాల్లో తమ మతాచారాల ప్రకారం చర్చిలు, మసీదుల్లో వివాహాలకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో కల్యాణ మండపాలతో పాటు షాదీఖానాలు, చర్చిల ఆధ్వర్యంలోని మ్యారేజ్ హాళ్ల బుకింగ్‌లు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ మూడు నెలల్లో వేలాది వివాహాలు జరగనున్నట్టు అంచనా.

శుభ ముహూర్తాలు ఇలా..

ప్రస్తుత ఆశ్వయుజ మాసం (అక్టోబర్ 2 నుంచి నవంబర్ 1) లో నాలుగు ముహూర్తాలు ఉన్నాయి. కార్తికమాసం (నవంబర్ 2 నుంచి డిసెంబర్ 2 వరకు) 17 ముహూర్తాలు, మార్గశిర మాసం (డిసెంబర్ 2 నుంచి 30 వరకూ) 12 ముహూర్తాలు ఉన్నాయి. ఆయా తేదీల్లో వధూవరులకు, ఇతర శుభకార్యాలు నిర్వహించే వారి నక్షత్రాలను బట్టి పైముహూర్తాలు నిర్ణయించుకోవాలని పండితులు చెబుతున్నారు.

మంటపాలకు గిరాకీ

వరుస తుపాన్లు, అల్పపీడనాలు, భారీ వర్షాల కారణంగా, వాతావరణం ఎప్పుడు అనుకూలంగా ఉంటుందో, ఎప్పుడు ప్రతికూలంగా ఉంటుందో తెలియని పరిస్థితుల్లో దాదాపు అందరూ తమ స్థాయిని బట్టి చిన్న, పెద్ద కల్యాణ మండపాల్లో వివాహాలకు మొగ్గు చూపుతున్నారు. దీంతో కల్యాణ మండపాలకు డిమాండ్ బాగా పెరిగింది. అంతేకాకుండా ఇళ్ల వద్ద తగినంత స్థలాలు లేక వివాహాలకు అనుకూలంగా ఉండకపోవటంతో వ్యయ, ప్రయాసలైనా తప్పక ఫంక్షన్ హాల్స్‌ను బుక్ చేసుకుంటున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కల్యాణ మండపాలన్నీ మూడు నెలలకు ముందుగానే బుక్ అయిపోయాయని కల్యాణ మండపాల నిర్వాహకులు చెబుతున్నారు.

ఈవెంట్స్ ప్రాధాన్యం

ఇటీవల కాలంలో పెళ్లికి కళ తీసుకువచ్చే ఈవెంట్స్‌కు డిమాండ్ పెరిగింది. వాటిలో వధూవరులు ఊరేగే రథాలు, గుర్రపు బగ్గీలు, కల్యాణ మండపానికి పెండ్లి కుమార్తెను తీసుకువెళ్లే వినూత్నమైన వాహనాలు, మల్లె పందిర్లు, కల్యాణ మండపం వద్ద స్వాగత ద్వారాలు, ఆవరణలో డెకరేషన్లు, రంగుల లైటింగ్ సెట్టింగ్‌లు వంటివి ఏర్పాటు చేస్తున్నారు. కల్యాణ మండపాలను వివిధ ప్రాంతాల నుంచి తీసుకువచ్చిన పచ్చిపూలతో అలంకరిస్తున్నారు. దీనికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. దీనికి రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్నారు. దానితో ఈవెంట్స్ నిర్వాహకులకు చేతినిండా పని, తద్వారా అనేక మందికి ఉపాధి దొరుకుతుంది.

మూడు నెలలూ అనుకూలం



ఈ ఏడాది ఆగస్టు, సెప్టెంబర్ నెలలు శూన్య మాసం, భాద్రపద మాసం కావడంతో వివాహాది శుభ కార్యాలకు ముహూర్తాలు లేవు. దానితో వివాహాలు జరగలేదు. ప్రస్తుత ఆశ్వయుజ మాసం నుంచి మార్గశిర మాసం (డిసెంబర్) చివరి వరకూ వివాహాలకు అనుకూలమైనవి. చాలా మంచి ముహూర్తాలు ఉన్నాయి.

–పిడపర్తి రవికుమార్, పండితుడు, పలివెల, కొత్తపేట మండలం



వధూవరులకు ఉత్సవ రథం

క్లుప్తంగా

పిడుగు పడి వ్యక్తి మృతి



కుటుంబ సభ్యులతో వీరాస్వామి (ఫైల్)

కాజులూరు: ఉప్పుమిల్లిలో సోమవారం పిడుగుపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఆ వివరాల్లోకి వెళ్తే.. కరప మండలం కూరాడకు చెందిన నందికోండ వీరస్వామి (35) కొన్నాళ్ల కిందట కుటుంబ సమేతంగా ఉప్పుమిల్లికి వచ్చి తాపి పనిచేస్తూ, పశువులను మేపుతూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం తెల్లవారు జామున భారీ వర్షం కురుస్తుండటంతో పశువులను పాకలో కట్టేందుకు పొలానికి వెళ్లాడు. ఆ సమయంలో వీరస్వామి పిడుగుపాటుకు గురవ్వగా స్థానికులు గమనించి యానం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. వీరస్వామికి భార్య, నాలుగేళ్ల కుమారుడు, మూడేళ్ల కుమార్తె ఉన్నారు. పెద్ద దిక్కును కోల్పోవడంతో ఆ కుటుంబం కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది.

ఆగి ఉన్న లారీని ఢీకొని..

అన్నవరం: తణుకు పట్టణం నుంచి కోడిగుడ్ల లోడుతో భువనేశ్వర్ వెళ్తున్న లారీ సోమవారం ఉదయం స్థానిక సత్యదేవుని నమూనా ఆలయం సమీపంలో ఆగి ఉన్న మరో లారీని వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో కోడిగుడ్ల లారీ ముందు భాగం నుజ్జు నుజ్జు అయ్యింది. ఆ లారీ డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. తుని ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం వారు తణుకు బయల్దేరి వెళ్లినట్లు పోలీసులు తెలిపారు.

రాష్ట్ర ఖోఖో జట్టుకు కరప విద్యార్థిని ఎంపిక



యస్మిత నాగమహి

కరప: స్థానిక నక్కా సూర్య నారాయణ మూర్తి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని బి.యస్మిత నాగమహి(పదో తరగతి) రాష్ట్ర ఖోఖో జట్టుకు ఎంపికైంది. బాలికల జూనియర్ విభాగంలో అండర్–17 నేషనల్ ఖోఖో పోటీలలో పాల్గొననుంది. తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరులో ఈ నెల 16, 17 తేదీలలో జరిగే జాతీయ స్థాయి ఖోఖో పోటీలలో బాలికల సౌత్‌జోన్ ఖేలో ఇండియా మ్యాచ్‌కి మన రాష్ట్రం తరఫున యస్మిత పాల్గొంటుందని పాఠశాల హెచ్‌ఎం ఎం.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. యస్మితకు తర్ఫీదునిచ్చిన పీడీలు కె.శ్రీనివాసరావు, బి.చంద్రశేఖర్, సీహెచ్ కృష్ణలను ఎమ్మెల్యే పంతం నానాజీ, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, పీఎంసీ చైర్మన్ దేవు దుర్గారావు, హెచ్‌ఎం శ్రీనివాసరావులు అభినందించారు.

యువకుల మృతదేహాల గుర్తింపు





గోదావరి పడి మృతి చెందిన నరాల వేదమూర్తి, మేడిశెట్టి వీరబ్రహ్మం

కె.గంగవరం: మండలంలోని కోటిపల్లి గోదావరి నదిలో దేవీ విగ్రహాల నిమజ్జనోత్సవానికి వెళ్లి గోదావరిలో నరాల వేదమూర్తి, మేడిశెట్టి వీరబ్రహ్మం గల్లంతైన విషయం విధితమే. వారి మృతదేహాలను సోమవారం పోలీసులు గుర్తించారు. ఆదివారం మధ్యాహ్నం దేవీ నిమజ్జనం అనంతరం స్నానానికి దిగిన ఆ ఇద్దరు యువకులు గోదావరి ఉధృతికి గల్లంతైన విషయం తెలిసిందే. అప్పటి నుంచి స్థానిక రెవెన్యూ సిబ్బంది, పోలీసులు గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం ఉదయం మేడిశెట్టి వీరబ్రహ్మం మృతదేహం, మధ్యాహ్నం వేదమూర్తి మృతదేహం లభ్యమయ్యాయి. మృతదేహాలకు స్థానిక పోలీసులు పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం యువకుల మృతదేహాలను బంధువులు సొంత గ్రామం రావిచెరువుకు తరలించారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ గ్రామంలో పర్యటించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

అధికారుల నిర్లక్ష్యంతో నిండు ప్రాణాలు బలి

కేవలం అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇద్దరు యువకుల నిండు ప్రాణాలు బలైపోయాయని వైఎస్సార్ సీపీ రామచంద్రపురం ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్ అన్నారు. ఆదివారం ఉదయం కోటిపల్లి గోదావరిలో జరుగుతున్న గాలింపు చర్యలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రసిద్ధి గాంచిన కోటిపల్లి గోదావరిలో ఏటా రెండు సార్లు నిమజ్జనోత్సవాలు జరుగుతాయన్నారు. ఆదివారం జరిగిన నిమజ్జనోత్సవాల వద్ద పోలీసు, రెవెన్యూ బందోబస్తు లేదన్నారు. కనీసం హెచ్చరిక బోర్డులు లేకపోవడం దారుణమని అన్నారు. ఆ రెండు రోజులూ బందోబస్తు ఉండి ఉంటే యువకుల ప్రాణాలు పోయేవికావని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

34 కిలోల గంజాయి స్వాధీనం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ సూర్యఅప్పారావు

ఏలేశ్వరం: మండలంలోని సి.రాయవరం సమీపంలో సోమవారం అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న యువకుడిని అరెస్టు చేసి 34 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. చెన్నై కవి భారతి నగర్, పెసరపూడి గ్రామానికి చెందిన పుగాజ్‌హెంది అనే యువకుడు గంజాయికి బానిసయ్యాడు. గంజాయి తాగుతూ మిగిలిన 34 కిలోల సరకును బైక్‌పై రవాణా చేస్తుండగా, సి.రాయవరం గ్రామ సమీపంలోని సత్తెమ్మ గుడి వద్ద నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. దీనిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ బి.సూర్య అప్పారావు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. నిందితుడిపై గతంలో అనేక కేసులు ఉన్నాయన్నారు. గంజాయి రవాణా చేసే వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. సమావేశంలో ఎస్సై రామలింగేశ్వరావు తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు



క్షతగాత్రురాలికి సపర్యలు చేస్తున్న హైవే అంబులెన్స్ సిబ్బంది

గండేపల్లి: మండలంలోని జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్ర గాయాలైనట్లు హైవే పెట్రోలింగ్ సిబ్బంది తెలిపారు. వారి కథనం ప్రకారం.. ధవళేశ్వరం గ్రామానికి చెందిన దంపతులు కె.రాజశేఖర్, రాణీ లక్ష్మి మోటార్ సైకిల్‌పై పిఠాపురంలో పాదగయలో దైవ దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా, తాళ్లూరు శివారు దాబాల వద్దకు వచ్చేసరికి రోడ్డు దాటే ప్రయత్నంలో మరో మోటారు సైకిస్ట్ వేగంగా రావడంతో ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో దంపతులిద్దరికీ గాయాలు కాగా, హైవే అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం జగ్గంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వెంటనే పెట్రోలింగ్ సిబ్బంది ప్రమాదానికి గురైన వాహనాలను పక్కకు తీయించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

కొత్తపేట: పురుగు మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానిక ఎస్సై జి.సురేంద్ర తెలిపారు. దీనికి సంబంధించి ఆయన కథనం ప్రకారం.. మోడేకుర్రు శివారు గొలకోటివారిపాలేనికి చెందిన ఈతకోట నాగరాజు (48) కూలి పనులు చేసుకుంటూ జీవనోపాధి సాగిస్తున్నాడు. అతను కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. కాగా ఆదివారం రాత్రి ఇంటి వద్ద వ్యవసాయానికి వాడే పురుగు మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. వెంటనే అతని భార్య సత్యవతి, కుమారుడు అవినాష్ చూసి 108 అంబులెన్స్ సాయంతో కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. సత్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మిస్టరీగా బాలుడి మృతి

- ఐదంతస్తుల భవనం నుంచి పడిన వైనం
- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు



చరణ్‌తేజ (ఫైల్)

కాకినాడ రూరల్: కాకినాడలో విషాదం చోటు చేసుకుంది. ఆడుతూ పాడుతూ తిరగాల్సిన బాలుడు అర్ధాంతరంగా తనువు చాలించాడు. ఐదంతస్తుల భవనం నుంచి పడి ఆత్మహత్య చేసుకున్నాడా లేదా ప్రమాదవశాత్తు పడిపోయాడా అనేది మిస్టరీగా మారింది. సర్పవరం పోలీసుల కథనం ప్రకారం.. కాకినాడ నాగమల్లితోట జంక్షన్ సమీపంలోని ఎల్బీ నగర్‌కు చెందిన కుక్కల చరణ్‌తేజ (13) సోమవారం ఐదంతస్తుల భవనం నుంచి పడి మృతి చెందాడు. పుస్తకాలు కోసమని ఉదయం ఇంటి నుంచి బయటకు వచ్చిన చరణ్ తేజ సుమారు 11.30 గంట ప్రాంతంలో భవనం ఎక్కడం కేవలం రెండున్న నిమిషాలలోనే కింద పడిపోవడం జరిగిపోయింది. చరణ్ తేజ కుటుంబం సమీపంలోనే నివాసం ఉంటుంది. తండ్రి మల్లేశ్వరరావు ఆటో డ్రైవర్‌గా, తల్లి సత్యాదేవి గృహిణిగా ఉంటూ ఇద్దరు పిల్లలను చదివిస్తూ జీవనం సాగిస్తున్నారు. అశోక్‌నగర్‌లోని ప్రైవేట్ స్కూల్‌లో చరణ్ తేజ ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. భవనం నుంచి చరణ్ తేజ పడిపోయినట్టుగా ఆ నోట ఈ నోట చెప్పుకోవడంతో తమ్ముడు అఖి ఆలకించి తల్లికి చెప్పాడు. వెంటనే భవనం వద్దకు వచ్చి చూసే సరికి రక్తపు మడుగులో ఉండగా, వెంటనే స్థానికుల సహాయంతో కాకినాడలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే చనిపోయినట్టు వైద్యులు నిర్ధారించడంతో తీవ్ర విషాదంతో ఇంటికి తీసుకువచ్చారు. మృతుడి చిన్నాన్న వీరాంజనేయులు ఫిర్యాదు మేరకు సర్పవరం సీఐ పెద్దిరాజు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. సంఘటన స్థలాన్ని డీఎస్పీ రఘువీర్ విష్ణు, సీఐ పెద్దిరాజు, సిబ్బంది పరిశీలించారు. ఐదంతస్తుల భవనం వద్ద సీసీ ఫుటేజీ పరిశీలించారు. చరణ్ తేజ భవనంపైకి వెళ్లిన కేవలం రెండున్నర నిమిషాల్లోనే కిందకు పడిపోవడంతో కావాలనే దూకి ఉంటాడా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అలాగే సెల్ ఫోన్లలో ఆన్‌లైన్ గేమ్‌లు అలవాటు ఉందా అనే కోణంలోనూ పరిశీలన చేస్తున్నారు. ఇద్దరు బిడ్డల్ని చదివించేందుకు రెక్కల కష్టంతో ఆటోను నడుపుకొంటున్న మల్లేశ్వరరావు, అతని భార్య సత్యాదేవి దంపతులు, బంధువులు రోదనలతో తీవ్ర విషాదం అలుముకొంది. డీఎస్పీ సూచనలకు అనుగుణంగా కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. ఇదిలా ఉంటే అటుగా వెళ్తున్న ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ కారును ఆపి న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు కోరారు. పోలీసులతో మాట్లాడి విచారణ చేయిస్తామని ఆయన హామీ ఇచ్చారు.



మృతదేహం వద్ద రోదిస్తున్న చరణ్‌తేజ తల్లిదండ్రులు, బంధువులు

గడ్డి మందు తాగి వ్యక్తి మృతి

కిర్లంపూడి: గడ్డి మందు తాగి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటనపై సోమవారం కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ టి.అప్పారావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. రమణయ్యపేట గ్రామానికి చెందిన నక్కరాజు రమణ (52) అప్పుల బాధ తాళలేక ఆదివారం తన స్వగృహంలోనే గడ్డి మందు తాగాడు. దీంతో కుటుంబ సభ్యులు ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తీసుకెళ్లగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, అబ్బాయి, అమ్మాయి ఉన్నారు. మృతుడి కుమారుడు నక్కరాజు వీరవెంకట దుర్గాప్రసాద్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

పల్లె పండుగ.. ఉత్తి దండగ

- వారోత్సవాల తొలి రోజే అట్టర్‌ఫ్లాప్
- మద్యం లాటరీతో అందుబాటులోని లేని అధికారులు
- తూతూ మంత్రంగా మొదటి రోజు కార్యక్రమం



మండల పరిషత్ కార్యాలయంలో పల్లె పండుగ శిక్షణకు హాజరైన ప్రజాప్రతినిధులు (ఫైల్)

అలమూరు: పల్లె పండుగ అన్నారు.. ఎనలేని అభివృద్ధికి ఇదే శ్రీకారం అని చెప్పారు.. తీరా తొలి రోజే చేతులెత్తేశారు. ఎంతో చేస్తారని చూసిన ప్రజానీకానికి మొండిచేయి చూపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయం లేక పల్లె పండుగ కార్యక్రమం ఉత్తి దండగగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం మద్యం దుకాణాల లాటరీకి ఇచ్చిన ప్రాధాన్యం పల్లె పండగకు ఇవ్వలేదని స్పష్టమైంది. దీంతో ఉమ్మడి జిల్లాలోని వివిధ నియోజకవర్గాలకు చెందిన ప్రజాప్రతినిధులూ సోమవారం పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించలేని పరిస్థితి దాపురించింది. రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టి నాలుగు నెలలు కావొస్తున్నా ఇప్పటి వరకూ ఒక పైసా కూడా విదల్చలేదు. దీంతో పాలకులు ఇప్పటి వరకూ గ్రామ స్థాయిలో ఏ అభివృద్ధి కార్యక్రమాన్నీ ప్రారంభించలేదు. భారీ వర్షాలకు దెబ్బతిన్న రహదారులను ఒక తట్ట మట్టితోనైనా పూడ్చలేదు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు గ్రామీణ ప్రజాప్రతినిధులకు భారీ ఊరటనిచ్చాయి. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం (ఎన్‌ఆర్‌ఈజీఎస్), 15వ ఆర్థిక సంఘం, సాధారణ అభివృద్ధి నిధుల కింద కేంద్ర ప్రభుత్వం గతంలో మాదిరిగానే ఈసారీ రాష్ట్రానికి భారీ నిధులను కేటాయించింది. దీంతో ఈ ఏడాది ఆగస్టు 23న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా ఉన్న 22 మండలాల్లోని 385 గ్రామ పంచాయతీల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తిస్తూ స్థానిక ప్రజాప్రతినిధులు ఏకగ్రీవ తీర్మానాలు చేశారు. ఆ గ్రామసభల్లో తీర్మానించిన పనులకు సంబంధించి తొలి విడతగా 777 పనులు చేపట్టడం ద్వారా రూ.54.52 కోట్లు ఖర్చు చేయాలని జిల్లా పంచాయతీరాజ్ శాఖ నిర్ణయించింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 2,23,738 జాబ్ కార్డులు ఉండగా, అందులో 1.51 లక్షల మంది ఉపాధి పొందుతున్నారు.

గత ప్రభుత్వంలో ఘనం

2023–24 ఆర్థిక సంవత్సరంలో అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో కేంద్ర ప్రభుత్వం జిల్లాకు 30 లక్షల పనిదినాలను కేటాయించింది. అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాత్రం ఉపాధి కూలీలకు మరింతగా మేలు జరగాలనే ఉద్దేశంతో రికార్డు స్థాయిలో 43 లక్షల వరకూ కూలీలకు పనిదినాలు కల్పించి ఆ మేరకు నిధులను విడుదల చేయించింది. దీంతో జిల్లావ్యాప్తంగా ఉపాధి పనుల ద్వారా సుమారు రూ.185 కోట్లు వెచ్చించింది. అందులో కూలీల వేతనాలు రూ.112 కోట్లు కాగా మెటీరియల్ కాంపొనెంట్ ద్వారా రూ.65 కోట్లు, పరిపాలన పరంగా రూ.ఎనిమిది కోట్లను ఖర్చు చేసింది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ భవనాల నిర్మాణంతో పాటు అంతర్గత రహదారులు, ఎస్సీ, ఎస్టీ కాలనీలు అభివృద్ధి చెందాయి. ప్రస్తుతం పల్లె పండుగ నిధులతో రోడ్ల అభివృద్ధితో పాటు మినీ గోకులాలు, పంట కాలువల ఆధునీకరణ, ప్రభుత్వ పరిపాలన భవనాలు, వాటర్ ట్యాంకుల నిర్మాణం, డ్రైనేజీలు తదితర అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. అయితే ఈ పనులను ప్రారంభించడానికి సోమవారం నిర్వహించిన గ్రామసభలు తూతూమంత్రంగా జరిగాయి. మొదట్లోనే ఇలా ఉంటే మున్ముందు పరిస్థితి ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో..



ఎన్‌ఆర్‌జీఈఎస్ పథకం కింద ఉపాధి పనులు వేగవంతం చేస్తున్నాం. ఇందులో భాగంగానే పల్లె పండుగ వారోత్సవాలు నిర్వహిస్తున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం. గత ఏడాది లక్ష్యానికి మించి ఉపాధి పనులు చేపట్టిన విధంగానే ఈ ఏడాది కూడా అదే తరహాలో ముందుకు సాగుతాం.

–పి.మధుసూదన్, డ్వామా పీడీ, కోనసీమ జిల్లా